క్లుప్తంగా

నేడు మంత్రి విశ్వరూప్ నామినేషన్



అమలాపురం టౌన్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ఉదయం 10.47 గంటలకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. తొలుత భట్నవిల్లిలోని కనకదుర్గ ఆలయాన్ని మంత్రి విశ్వరూప్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భట్నవల్లిలోని మంత్రి క్యాంపు కార్యాయలం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ పాదయాత్రతో ర్యాలీగా వెళ్లనున్నారు. అక్కడ ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేశవ వర్ధన్‌రెడ్డికి తన నామినేషన్ పత్రాలను సమర్పిస్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి విశ్వరూప్ కోరారు.

వైభవంగా శ్రీరామ యజ్ఞం



శ్రీరామ యజ్ఞాన్ని నిర్వహిస్తున్న ఆధ్యాత్మికవేత్త కుమార్ శంకర్‌గౌడ్

అమలాపురం టౌన్: అష్టోత్తర శత శ్రీరామ యజ్ఞ కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, వాస్తు పండితుడు రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక లోకా స్సమస్తా స్సుఖినోభవంతు కార్యాలయంలో శ్రీరామ యజ్ఞం ఆదివారం వైభవంగా జరిగింది. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఐవీ రామకృష్ణ, అయినవిల్లి నాగేంద్రకుమార్, ఆర్.లోకేష్, గోపాల్, ఆర్.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో విస్తృత తనిఖీలు



ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఐ.పోలవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎదుర్లంక వారధి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు, ఎస్ఈబీ, ప్రత్యేక దళాలు 24 గంటలూ తనిఖీలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు ఎస్ఐ జె.భానుప్రసాద్ ఆదివారం వాహనాలు, కార్లు, కంటైనర్లను తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎవరైనా మద్యం, నగదు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మండల కాపునాడు అధ్యక్షుడిగా సురేష్



అబ్బిరెడ్డి సురేష్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకుంటున్న మద్దింశెట్టి సుబ్బరాజు

ఉప్పలగుప్తం: మండల కాపునాడు అధ్యక్షుడిగా గొల్లవిల్లి గ్రామానికి చెందిన మద్దింశెట్టి సుబ్బరాజు(సురేష్) నియమితులయ్యారు. ఈ మేరకు కాపునాడు రాష్ట్ర కార్యనిర్వాహక వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ చేతుల మీదుగా ఆదివారం ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ మండలంలో కాపుల అభ్యున్నతి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. మండలానికి చెందిన పలువురు నాయకులు ఆయనను సత్కరించి అభినందించారు.

బాహుర్‌లో అత్యధికం.. మాహేలో అత్యల్పం..

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికలో బాహుర్ నియోజకర్గంలో అత్యధికంగా 88.76 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ స్థాన పరిధిలోని మొత్తం 33 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాహేలో అతి తక్కువగా 65.11 శాతం పోలింగ్ నమోదైందన్నారు. మన్నాడీపేటలో 85.22, ఒసుడులో 85.75 శాతం, మంగళంలో 78 శాతం, ఉజవకరైలో 72.90 శాతం, కదిరిగమంలో 74.91 శాతం, ఇందిరానగర్‌లో 80.12 శాతం, కామరాజ్‌నగర్‌లో 74.12 శాతం, ఇలసుప్పేట్‌లో 77.25 శాతం, కాలపట్టులో 82.30 శాతం, మదులైపేటలో 76.24 శాతం, రాజ్‌భవన్‌లో 72.13 శాతం, ఉప్పలంలో 79.47 శాతం, ఉరులైన్‌పేటలో 75.35 శాతం, నెల్లితోపులో 80.74 శాతం, అరైనగుప్పమ్‌లో 81.26 శాతం, మనవేలిలో 82.45 శాతం, మదలైర్‌పేటలో 78.02 శాతం, ఇంబలంలో 85.40 శాతం, నెట్టిపాకంలో 85.89 శాతం, బాహుర్‌లో 88.76 శాతం, కారైకల్ నార్త్‌లో 73.75 శాతం, కారైకల్ సౌత్‌లో 71.30 శాతం, నిరావిదా పట్టిరనమ్‌లో 77.52 శాతం, యానాంలో 77.36 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం



ముమ్మిడివరంలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతిచ్చి బొట్టు పెడుతున్న మహిళ



ప్రచార రథం పైనుంచి ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- నగర పంచాయతీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 20 వార్డుల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల పక్షాన నిలబడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును అత్యధిక మెజారీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో తిరుగుతున్న ప్రతి గడపలో తమకు ప్రభుత్వ పథకాల వల్ల ఎంతగానో మేలు చేకూరిందని ప్రజలు చెబుతున్నారన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన జగనన్న రుణం తీర్చుకోవడానికి తమ ఓటు జగనన్నకే వేస్తామని వారు ముక్త కంఠంతో చెబుతున్నారన్నారు. ఇంతటి ప్రజాదరణ కలిగిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జి, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు గంజా శ్రీనివాసరావు, రాయుడు శ్రీను, సరిపెల్ల రామకృష్ణంరాజు, గణేశుల బ్రహ్మానందం, కాండ్రేడుల త్రిమూర్తులు, రెడ్డి శివన్నారాయణ, రేకాడి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఒకవైపు లోఓల్టేజీ.. మరోవైపు హైఓల్టేజీ..

- విద్యుత్ సరఫరాలో వ్యత్యాసంతో ప్రజలకు ఇక్కట్లు
- దేవగుప్తం, బెండమూర్లంక సబ్‌స్టేషన్ల పరిధిలో సమస్య

అల్లవరం: మండలంలోని దేవగుప్తం, బెండమూర్లంక సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఏపీఈపీడీసీఎల్ సరఫరా చేస్తున్న విద్యుత్ పంపిణీలో వ్యత్యాసం కనబడుతుంది. ఒక సబ్‌స్టేషన్లో హైఓల్టేజీ పంపిణీ అవుతుంటే, మరో సబ్‌స్టేషన్లో లోఓల్టేజీ సరఫరా అవుతుంది. మండలం ఒక్కటే అయినా విద్యుత్ పంపిణీలో వ్యత్యాసం ఎందుకు వస్తుందనేది వినియోగదారులకు అంతు చిక్కడం లేదు. ఈ ఏడాది వేసవి ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు ఏసీలు, ఎయిర్ కూలర్లపై ఆధారపడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. అలాగే ఏప్రిల్, మే నెలల్లో ఆక్వా రంగానికి విద్యుత్ చాలా కీలకం. అయితే విద్యుత్ వినియోగానికి తగిన సప్లయ్ లేకపోవడంతో లోఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతుంది.



దేవగుప్తం సబ్‌స్టేషన్

ఇళ్లల్లో ఫ్యాన్లు తిరగడమూ గగనమే

దేవగుప్తం సబ్‌స్టేషన్ పరిధిలోని దేవగుప్తం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, ఎంట్రుకోన, తాడికోన, అల్లవరం, గోడితిప్ప, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాల్లో సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఇళ్లల్లో ఫ్యాన్లు తిరగడం గగనమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అయితే దీనికి విరుద్ధంగా బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలో హైఓల్టేజీ సరఫరా అవుతుంది. దీంతో అక్కడ తరచుగా విద్యుత్ డ్రాప్ అయ్యి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఒక ప్రాంతంలో లోఓల్టేజీ, మరో ప్రాంతంలో హైఓల్టేజీ సరఫరా చేయడంపై విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం దాగి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌ని సాకుగా చూపి విద్యుత్ అధికారులు వినియోగదారులు ఫిర్యాదులను పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి దేవగుప్తం, బెండమూర్లంక సబ్‌స్టేషన్ల పరిధిలో నెలకొన్న లోఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. దీనిపై వివరణ కోసం స్థానిక ఏఈని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

జగన్ హయాంలోనే కాపుల సంక్షేమం



వైఎస్సార్ సీపీ కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- ముమ్మిడివరంలో వైఎస్సార్ సీపీ కాపుల ఆత్మీయ సమావేశం

ముమ్మిడివరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే కాపులకు సంక్షేమ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి ముమ్మిడివరంలోని జగతా బాబ్జీ స్వగృహ ఆవరణలో వైఎస్సార్ సీపీ కాపుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితానికి తోట త్రిమూర్తులు, తాడి తాతారావులు బీజం వేశారన్నారు. కాపులు వైఎస్సార్ సీపీకి నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తున్నారన్నారు. కాపు జాతి ఆత్మ విశ్వాసానికి నిలువుటద్దమని చెప్పారు. నియోజకవర్గంలో కాపులకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అనేక పదవులిచ్చి ఉన్నత స్థానంలో నిలిపినట్లు తెలిపారు. నాలుగు మండలాల్లో ఒక ఎంపీపీ, మూడు వైస్ ఎంపీపీ పదవులతో పాటు 24 సహకార సంఘాల అధ్యక్షులలో 12 కాపులకే కేటాయించామన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ కాపు నేతలు

కాపులంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌ను వైఎస్సార్ సీపీ కాపునేతలు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుల విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో కాపు నేతలు కోలా గంగాభవానీ, ఏడిద చక్రపాణిరావు, బాబ్జి, రాయపురెడ్డి జానకిరామయ్య, గోదశి నాగేశ్వరరావు, కాటంశెట్టి రామ్మూర్తి, బూరెల వెంకట్రాజు, ఏడిద సుబ్బు, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, మెండ వెంకటేశ్వరరావు, సలాది నాగబాబు, తోట మాణిక్యాలరావు, రంబాల విష్ణు, అక్కల శ్రీధర్, యర్రంనీడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు ప్రశంసాపత్రం

అమలాపురం రూరల్: కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ నుంచి అమలాపురం మెడికల్ డీలర్, బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్ కింద నిక్షయ్ మిత్రగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టీబీతో బాధపడుతున్న వ్యక్తులకు చేసిన సేవకు గాను ప్రశంసా పత్రం వచ్చింది. ఈ సందర్భంగా ఆయనను పట్టణంలో పలువురు అభినందించారు.

చలివేంద్రాల ప్రారంభం



మందపల్లి వంతెన వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) దేవస్థానం ద్వారా వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏటా వేసవి సీజన్‌లో రావులపాలెం-కొత్తపేట ప్రధాన రహదారిలో వాహనదారుల దాహార్తి తీర్చేందుకు చల్లటి మజ్జిగతో వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దానిలో భాగంగా దేవదాయ-ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో మందపల్లి పెద్ద వెంతెన సమీపంలో ఒకటి, ఏనుగుల మహల్ చిన్నవంతెన వద్ద ఒకటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శనైశ్చర ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, దేవస్థానం సూపరింటెండెంట్ మాచిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎస్ఏ రవికుమార్ పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అలమూరు: శ్రీచింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతోంది. ఆదివారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల చేత కాగడాలు వెలిగించి వారకళ్లు, తుళ్లబిళ్లను దిష్టి తీయించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుద్ధ్యాన్ని నెలకొల్పుతున్నారు. వాహనాలన్నింటిని తీర్థంలోకి అనుమతించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాస్ తెలిపారు.

అంతా కృష్ణమయమే..

అయినవిల్లి: ఈ అనంత లోకాలు కృష్ణమయమే, ఆయన మెచ్చేటట్టు మనం జీవించాలని, అప్పుడు మానవ జీవితం శార్థకమవుతోందని నల్లచెరువు గ్రామంలోని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసాదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో శ్రీకష్ణుని తత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవత్ గీత మన రాతను మారుస్తోందన్నారు. భగవత్ గీతను విన్నా చదివినా జన్మ చరితమవుతోందన్నారు. భగవంతుడు సూచించిన దారిలోనే మనం ప్రయాణించాలని ఆయన సూచించారు. ఆయన సేవలో తరించిన వారికే మోక్షం లభిస్తుందన్నారు. దేవాధిదేవుడు సేవ చేయడం కూడా పూర్వజన్మ శుక్రుతమే అన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.



ప్రవచనం చేస్తున్న సుందర శ్రీనివాసదాసు ప్రభూజీ

హోమియో వైద్యశాల ప్రారంభం



వైద్యశాల సేవలను వివరిస్తున్న నిర్వాహకులు

కె.గంగవరం: పాత కోట గ్రామంలో ఆదివారం ది వరల్డ్ టీచర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశాలను ప్రారంభించారు. ఇప్పటి నుంచి ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశాలను విశాఖపట్నానికి చెందిన సద్గురు పీఠం అధ్యక్షుడు గురు ప్రసాద్, కార్యదర్శి బీఆర్‌కే రాజు ప్రారంభించారు. కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ్య హోమియో వైద్యులు ఈ వైద్యశాల వద్ద పరీక్షలు చేస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరరాఘవ, జీఆర్ఎస్ఎస్ శర్మ, వర్షా, యశోస్వీ, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం



పుష్కరిణిలో విహరిస్తున్న కోనేటి రాయుడు

శేషవాహనంపై ఊరేగిన కోనేటి రాయుడు

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా కోనేటి రాయుని తెప్పోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో కాసేపు విహరించారు. గర్భగుడిలో కొలువై ఉన్న స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై పుష్కరిణికి తోడ్కుని వచ్చి విద్యుత్ దీపాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఆశీనులను చేశారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు తొలుత ప్రత్యేక పూజలు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలోని కోనేరు(పుష్కరిణి)ని విద్యుత్ దీపాలతో నయానందకరంగా అలంకరించారు. మిరుమిట్లు గొలిపే వెలుగుల నడుమ శేష వాహనంపై కోనేటి రాయుడు తెప్పోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించారు. తెప్పోత్సవం జరుగుతుండగా భక్తుల గోవిందనామ స్మరణతో దేవస్థాన ప్రాంగణం మారుమోగింది. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 3.32 గంటలకు స్వామి వారి సదస్యం క్రతువును అర్చక స్వాములు నిర్వహించారు. అబ్బిరెడ్డి సురేష్, సంధ్యారాణి దంపతులు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, పట్టణ వైశ్య సంఘం నాయకుడు యెండూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరినవారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ఐ.పోలవరం మండలం తీర గ్రామమైన భైరవపాలెం తీర్థాల మెండికి చెందిన సుమారు 200 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం ముమ్మిడివరంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరినవారికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య వికాస విభాగం ప్రధాన కార్యదర్శి పోతాబత్తుల గోవిందరాజులుతో పాటు పోతాబత్తుల నాగేశ్వరరావు, పెమ్మాడి నాగూరు, పోతాబత్తుల వెంకటరావు తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెమ్మాడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నమశ్శివాయం గెలుపు ఖాయం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీజేపీ,ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి నమశ్శివాయం గెలుపు ఖాయమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కాపు కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు, పార్టీ కార్యకర్తలు, గొల్లపల్లి అభిమానులు ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేయడంతో పాటు ఓటర్లను చైతన్యవంతం చేయడం వల్లే మెరుగైన పోలింగ్ శాతం నమోదైందన్నారు. తాను ఎప్పటికప్పుడు పోలింగ్‌బూత్‌ల పరిధిలోని కార్యకర్తలతో మాట్లాడుతూ పోలింగ్ సరళిపై సమీక్షించానన్నారు. యానాం నియోజకవర్గ అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలుకు బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం సహకరిస్తుందనే హామీ మేరకు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేనైన తాను నమశ్శివాయంకు మద్దతునిచ్చానన్నారు. మల్లాడి కృష్ణారావు తాను కలిసిపోయామనే ప్రచారం అవాస్తవమని, దాన్ని ఎవరూ నమ్మొద్దన్నారు. నోటాకు ఓటు వేయమని ప్రచారం చేసిన మల్లాడి సైద్ధాంతికపరంగా తనకు బద్ధ విరోధి అని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పండు సిద్దార్ధ, కాకి నాగేశ్వరరావు, పులవర్తి శ్రీను, నక్కల సుబ్బన్న, సబ్బతి లోకేష్, ఎస్ఆర్ఎంటీ మూర్తి, బెజవాడ నిరంజన్, కొమ్ము కుమారి, చెక్కల అరుణ్, పడాల వెంకటేశ్వరరావు, మహ్మద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

దాతలు ముందుకు రావాలి


అమలాపురం టౌన్: వేసవిలో వాహన చోదకులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ శుక్లా తన తండ్రి ఎంఎల్ శుక్లా, కుమారుడు రియెన్షుతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించి ప్రజలకు మజ్జిగ అందజేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు విధిగా పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శుక్లా సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.



చలి వేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శుక్లా, ఆయన కుమారుడు రియెన్షు

జోరుగా వరి కోతలు

అంబాజీపేట: వరి కోతలు జోరందుకున్నాయి. ముందుగా ఊడ్చిన చేలు తక్కువ కాలంలోనే పక్వానికి రావడంతో రైతులు కోతలు చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, వక్కలంక, ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు, పసుపల్లి, చిరతపూడి, ఇసుకపూడిలో కోతలు జరుగుతున్నాయి. ఈ సారి వరి కోతలకు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గతేడాది మండలంలో 60 శాతం వరి కోతల్లో యంత్రాలను వినియోగించగా, ఈ సారి 90 శాతం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే వ్యవసాయ కూలీలు పరిమితమవుతున్నారు. యంత్రాల ద్వారా ఎకరానికి రూ.2500 ఖర్చవుతుండగా కూలీలు, కోత కోయడానికి రూ.1500, తిరిగి పనలు కట్టి, మాసూలు చేయడానికి రూ.3 నుంచి రూ.4వేలు అవుతున్నాయి. దీంతో అధిక శాతం రైతులు వరి యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. నేలతడి ఆరని ప్రాంతాల్లో తప్పని పరిస్థితుల్లో కూలీలను వినియోగిస్తున్నారు. మండలంలో 2998 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకూ 300 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి.



కోత యంత్రంతో జరుగుతున్న వరి మాసూళ్లు

అన్న సమారాధనలు

అంబాజీపేట: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మండలంలో రామాలయాల వద్ద ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. మాచవరం పోతాయిలంక పెచ్చెట్టివారిపాలెం, అంబాజీపేట కొర్లపాటివారిపాలెం, పుల్లేటికుర్రు బొంతు వారిపేట తదితర ప్రాంతాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధనలు చేశారు.